## శ్రీ చట్టి హనుమంతరావు

# ఆర్కెస్ట్రా

ఆ క్షణాల్లో - మా వీధి - అదే మా పట్టాభి వీధి. ఆ వీధిలో మా వాళ్ళంతా ఏంచేస్తూంటారో?

ఆ వీధిలో వున్నన్నాళ్ళ అనుభవం ఎంత బావుండేది– ప్రతి ఇంటిచుట్టూ పైకి లేచిన కొబ్బరిచెట్లు- ఎండ అనిపించనీయని చెట్లగాలి- కొబ్బరాకులతోనే అల్లిన దళ్ళు, మండువా లోగిళ్ళు -

కరువుతీరే ఆప్యాయతతో పాటూ- కక్షలు కావేషాలు, సెన్సిటివ్ మనుషుల్లో అంటిపెట్టుకున్న ఆచారపు నిష్టలు- అమాయకత్వంతో కూడుకున్న మూర్ఖత్వం. ఏమైనా ఆ జ్ఞాపకాల్ని- నాల్గేళ్ళ క్రిందటి స్మృతుల్ని తరచి చూసుకుంటే ఏ గోదావరి పాయలోనో హాయిగా కులాసాగా ఈదులాడినంత సంతృప్తి. కోనసీమలో పరికించి చూస్తే ఒక్కక్షణం ఏ కొబ్బరాకుచాటు నించో తెలుగుతనం మూర్తీభవించి కనిపించి మాయమవుతుంది.

నాల్గు సంవత్సరాల క్రిందటి జ్ఞాపకాల ఆధారంగా ఈ క్షణాల్లో మా వీధిని చూడ్డానికి మనస్సుని వీధి ప్రవేశం చేయిస్తూ –

ఆ వీధి మొదట ప్లీడరు శర్మగారి ఇల్లు - పెంకుటింటి కటకటాల వసారా లోపల్నించి కేకలు- ఇంకెవరూ ఇంటి యజమాని శర్మగారే –

"అబ్బా! మీ వ్రతాలూ - పూజలు కాదుగానీ నాదుంప తెగుతోంది. ఆ మరీనూ- అదేదో చంటిదాని పెళ్ళిలోనే ఏకవల్సిందిగా- అన్నీ కల్సివచ్చేవి. వరేయ్! చవటా మురికిలో దొర్లిన వెధవ బ్యాటు తీసుకొచ్చి దస్తావేజుల పక్కన పెడతావూ! తియ్యి చూస్తావే పెరట్లో పారెయ్యి- కాంతం ఆ ఫ్లాస్కు ఏవో తొందరగా తగలెయ్యి, అమ్మడూ-బోడసకుర్రు మునసబు వస్తే తోటకి వెళ్ళానని చెప్పు అర్జంటయితే అక్కడికే రమ్మను తెలిసిందా ఏమిటే వంట్లో ఎలావుంది. రాత్రి అన్నం సయించిందా టానిక్కవ్వగానే చెప్పు నే తీసుకువస్తాను." పక్క ఇంటి వాటాలో అద్దెకుంటున్న పక్కవూరి హైస్కూలు హెడ్ మాస్టారు రామమూర్తి "ఏమేవ్ కాఫీ కొంచెం వెచ్చబెట్టి ఇస్తావ్ - ఆఁ వచ్చాడా! ఈసారి ఇంటికి వస్తే మొఖం మాడేటట్టు చివాట్లు బెట్టు. చివరికి నాతోకూడా అల్లానే వాగుతాడు వెధవ – అయినా వాడి భవిష్యత్తంతా నా చేతిలోనే వుందిగా–ఆ స్పెషల్ ఇంక్రిమెంట్ - టూర్ ఎడ్వాన్సు నా సంతకం లేకుండా వస్తాయనుకుంటున్నాడు కాబోలు. అన్నట్టు ఆ వెధవ్వేళంగి వారి అబ్బాయి వచ్చాడా-ఆ హిప్పీ జుత్తువాడు-ఆ వాడే–ఆ ముఖానికి ఆ జుత్తొకటి – రాలేదూ – ఆరి స్కౌవుండ్రల్ నిన్న హోటల్లో ఎవరితోనో మాట్లాడుతుండగా నా దగ్గరికి వచ్చి మీఫీజు ఇంట్లో ఇచ్చానండీ అని నవ్వుకుంటూ పోయాడు. నల్గురిలో నేనేదో సర్దుకోబట్టి అంత అవమానం నించి తప్పించుకున్నాను. చెబుతా వాడిపని. అన్నట్లు అమ్మాయి ఉత్తరం రాసింది ఆదివారం వరకూ ఊటీలో ఉంటారట అట్నించి మైసూరు వెళతారట."

వాళ్ళింటి పక్కనే ఉన్న రమణమ్మగారి భర్త ఎండోమెంట్సు డిపార్టుమెంట్‌లో ఉద్యోగం. రమణమ్మ గారితో పోట్లాడుతున్న పక్కింటి సుందరి

"మీ వాడికి అంతగా కావాలని వుంటే ఏ వీధిలో కుక్కతో, ఇష్టం లేనివాళ్ళ చెవులో కొరుక్కోమనండి–

అయ్యో బుజ్జి స్వీటీ – ఏడ్వకురా మా చిన్నన్నయ్య నాకిష్టమని వైజాగు నించి తెచ్చి ఇచ్చాడు. వెధవ కొబ్బరి నౌజు మీఇంట్లో రోజూ చేసేదేగా పాపం నోరులేనిది – గాట్లుచూశారా ఎలా ఏడుస్తోందో'

"మావాడి సంగతి తెల్సీ మీ కుక్కని అలా విడిచిపెడితే ఎలాగండి? ఫరవాలేదులేండి. రా నాయనా-నీకు మళ్ళీ పెడతాను."

ఆ పక్క ఇంట్లో వుంటున్న ఆయుర్వేదం డాక్టరుగారింట్లో ఏవో పొళ్ళు నూరుతున్న చప్పుళ్ళు. భీమశంకరం గారి మూడో అమ్మాయి మామిడి చెట్టుకింద మంచంమీద నీరసంగా పడుకొని వుంది. ఆ అమ్మాయి వేవిళ్ళ వికారాన్ని పోగొట్ట డానికి ఉసిరికాయ డబ్బా పుచ్చుకొని అమ్మమ్మ తెగ తంటాలు పడుతోంది.

ఆ పక్కఇల్లు గోపాలం గారిది. పిల్లలందరూ గుమ్మంలోంచి తలలు బయటపెట్టి అరుగు మీదకి విచిత్రంగా చూస్తున్నారు.

ఆ ఇంటి మామ్మగారు అరుస్తోంది. వరేయి కిట్టూ నువ్వెళ్ళి పనివాన్ని పిల్చుకురా! ఫో తొందరగా ఫో అసలే నాకూ మీ అమ్మకూ ఉపవాసం. ఈ రోజు ఇదెక్కడి తద్దినం-ఏ కాకో, కుక్కో తెచ్చి పడేసి వుంటుంది. అమ్మా సుబ్బలక్ష్మీ నువ్వెళ్ళి బావి నీళ్ళు తీసుకురామ్మా. మావిళ్ళు వచ్చాక శుభ్రం చేయించి అరుగు బావిడి అంతా కడిగించేస్తాను. ఒక్క కాగు చాల్లేవే! ఆ! మరీనూ!

వెధవ సంత ఎలా తిని ఏడుస్తారో-మనుషులో - రాక్షసులో

వరేయి! ఏమిటా్రి చోద్యం - ఏమిటంటూ -

"మామ్మా వెనుకకాలి ఎముకా! ముందుకాలి బొమికా అని చూస్తున్నానంతే. అబ్బా - దూరంగానే ఉన్నానులేవే-"

పక్కింటి దీక్షితులు గారింట్లోంచి -

లక్షపత్రి పూజకి విజయనగరంనించి రామనాధం సోమయాజులుగార్కి వారి బావగార్ని పిలిపిద్దామనుకుంటిమి కదా. అదే మొన్న కమిటీలో తీర్మానించాం కదా. ఎక్కవుంటులోంచి నాల్గు వందలు తీయించి మావాడ్ని విజయనగరం పంపించాను. మా ఇంట్లోనే మకాం అదీను అనుకొండి. ఆ, అగుతాడు-మా మూడో అమ్మాయి నిర్మల పురిటికి ఈ సారికి ఇక్కడికే వస్తానని వాళ్ళమ్మకి ఉత్తరం రాసింది. ఎలాగూ - అనకాపల్లి అదే దారికాబట్టి పదిరోజులు ముందు అయితే అయింది తీసుకోచ్చేయ్యమన్నాను. - అమ్మా సుశీ - శాస్త్రిగార్కి మంచినీళ్ళు పట్రా.

ముఖాన బొట్టు లేనట్టుంది చూడు.

ఆ పక్క ఇంటివాళ్ళ తులసి చెట్టు వాడిపోయి - ఎండిపోయే పరిస్థితుల్లో వుంది. ఇంటి వాళ్ళంతా మొన్నీమధ్యే ఉత్తర దేశ యాత్రలకి వెళ్ళి పోయారు. పోస్టుమాన్ కవరు నొకదాన్ని తలుపు సందులోంచి లోపలికి పడేయడానికి తంటాలుపడుతున్నాడు.

ఈ వాటాలో మొన్నీమధ్యే దిగినట్లున్నారు. కొత్తగా పెళ్ళి గ్కటా అయిన కాపురం కాబోలు. ఈ ఇంటి తలుపుల్ని ఒక్క క్షణం తెరిపించ గలిగే వీరు లెవరయినా వుంటే - ఒక్క పాలవాడు - తప్పితే పనిమనిషి.

ఆ ఇంటి పక్క మొదటివాటా శైలజమ్మగార్ని ఓదార్చుతూ రెండవ వాటా జానకీబాయి.

"ఇంకా ఎందుకండీ బాధపడతారు. పిల్లాడు క్షేమంగానే ఉన్నట్టు తెల్సిందికదా-ఎంత జంతువులతో ఆడేవాళ్ళయితే మాత్రం వాళ్ళు మాత్రం మనుషులు కారటండీ! ఏదో పని జేయించినంత మాత్రాన తిండి పెట్టకపోరు. అయినా మీ వీరేషు మాత్రం ఎన్నాళ్ళుండ గలడండీ మిమ్మల్ని విడిచిపెట్టి - ఏదో కొత్తతో వెళ్ళాడు కానీ మొహమ్మొత్తి నాల్గురోజుల్లో ఆ సర్కస్సు వాళ్ళ కళ్ళుకొట్టి ఇట్టే వస్తాడు.

అదిగో నామాట సత్యం! విన్నారా మా ఇంట్లో కొత్త గడియారం గంట కొట్టింది. మా పిల్లలు గొడవ జేస్తున్నట్లున్నారు - నే వెళుతున్నా కానీ బాధ పడకండమ్మా -"

ఎదురుగా ఆ వూరి లీడింగ్ లాయర్ భక్తవత్సలంగారి ఇంట్లో ఆయన్ని పెంచిన మేనత్త తద్దినం హడావుడి. పెరట్లో గాడిపొయ్యి పొగ వీధిలో పక్కగుమ్మంలోంచి చాటుగా ఇంట్లోకి హోటల్నించి టిఫిన్ చేరవేస్తున్న మునిమనమడు అండ్ కో.

డిప్టీ తాసిల్దారి ఇంట్లో పెద్దమ్మాయి సుశీల చిన్నమ్మాయి సుందరితో - వసేయి - ఏమైనా సరే ఇవాళ మాష్టారిచేత కొత్త రాగమేదయినా చెప్పించుకొని గానీ వదిలేదిలేదు. ప్రకాశం వీధిలో మనతోపాటు నేర్చుకుంటున్న మాలినికి రెండు కొత్త రాగాలతో పాటు అన్నమాచార్య కీర్తనలొచ్చేసాయిట.

పక్కఇంట్లో డిటెక్టివ్ నవలలు రాసే ఆయన వెస్టర్న్ మ్యూజిక్ వింటూ గదిలో కాగితాలతో కుస్తీ పడుతున్నాడు. అతని భార్య కల్పన పూలకోసం అవల వీధి నవలల ఫ్రెండ్ పంపిన పనిపిల్లకి సన్నజాజి మొగ్గలు తుంచి ఇస్తూ ఓపక్క పూర్తిచేసి ఇవ్వాల్సిన సీరియల్ ని సీరియస్‌గా చదివేస్తోంది.

ఆ పక్కవాటాలో అద్దెకుంటున్న వాళ్ళింటిలోంచి కొత్తగా కొన్న ఛేంజరికార్డరు పెంకులు బద్దలు కొడుతోంది.

ఆ పక్క ఇంటి మామ్మగారు వడియాల్ని కాపలాకాస్తూ కూనిరాగాలు తీస్తోంది.


**చరిత్ర పుస్తకములు**

1 సం. చారిత్రిక శ్రీశైలము, భారతీయ సంస్కృతి, చారిత్రిక కాశీ. 2 సం. రామాయణ భారత విమర్శనములు. 3 సం. ఆంధ్రుల చరిత్ర, ప్రాచీన ఆంధ్ర గ్రంథాలయ చరిత్ర. 4 సం. రెడ్డిరాజుల కాలము స్వర్ణయుగము, జేనసు, వెలమ, నాగార్జున చరిత్రలు. ఇవిగాక 15 చరిత్రలు కలవు.

వివరములకు వ్రాయండి :

**కె. ఎల్. నారాయణచౌదరి,** బి. ఏ.

చరిత్రకారుడు, మోపర్రు, తెనాలి తా.

ఇళ్ళ హడావిడి వదిలి వీధిలో రోడ్డుమీద సంబడం చూస్తే.

ఒకచోట "వరేయి గంటలో వస్తా - రెడీగావుండు బట్టలు వేసుకొని."

"ఏయ్ పిల్లా! ఆ కొబ్బరిమట్ట మా చెట్టు మీదనించే పడింది అలా వదిలేయి - ఊ! నిన్నే."

"అలా రోడ్డు మీద రాళ్ళు విసరకు నాయనా! వెళ్ళు ఇంట్లో కెళ్ళి ఆడుకో -"

"చూస్తాను సాయంత్రం ఇలా వెడుతుందికదూ - అప్పుడు దాని పొగరణగ దీస్తాను - దర్జీ" ........

"అక్కయ్యో - ఈ వాల్ పోస్టరు బావుంది కదూ - ఛీ! అప్పుడే ఎవరో పేడపూసేసారే -"

నాన్నోయి - నా రిబ్బను మర్చిపోకు - ఎఱ్ఱ రంగుది.

ఇంకా -

వీధిలో మంచి శకునంకోసం గంటనించి ఎదురు చూస్తున్న సుబ్బారావు -

పదేళ్ళ పిల్లాడ్ని వీధి ప్రెస్టేజీకోసం చావగొడ్తున్న నర్సమ్మ. సీతాకోక చిలుకని పట్టి నల్లేస్తున్న ఏడేళ్ళ రాంబాబు.

ఏకాసి స్నానంకోసం జిల్లేడాకులు కోస్తున్న అవధాన్లు -

అక్క నోటు బుక్కులో బొమ్మలు గీస్తున్న శీనప్ప -

పెళ్ళి ముహూర్తం దగ్గరవడంతో చెప్పలేని దిగులుకలసిన ఆనందంతో ఇల్లంతా పనిలేకుండా తిరిగేస్తున్న వసుమతి —

భర్త రాకకోసం ఆశని ఆకాశం అంత చేసుకొని చూసే నిర్మలమ్మ —

వీళ్ళందర్ని తల్చుకున్నప్పుడల్లా - అబ్బా —

# పులి పంజా

## "సస్యశ్రీ"

మా విశాఖలోని మత్త కోకిల మరి మారుపలుకదు;
మధురసాలూరు మందారం తేట తెలుగు లిక ఒలుకదు.
పదిమందిపలుకుబడిలో దేవతలకు పంచాంగం చెప్పడానికి,
కోయిల హంసగా మారి పోయింది ఎగిరి దివికి;
"సౌదామిని" వెలుగులో మందారం చేరుకుంది నందనానికి,
పారిజాతాన్ని పెకలించి పట్టుకు రాడానికి భువికి.

తెలుగుమీరి మిద్దెక్కిన పద్యాన్ని తెగువతో కిందకుదింపి
తేలిక వచనంగా, చెవులు మెలిపెట్టి, తెలిగించుకొని,
గంపలతో వాడుక భాషను గాదెలలో నింపి,
గద్యానికి గండ పెండరము వేసి గద్దెమీదకు పంపి,

గుప్పెడు కప్పురం తీసి గుప్పున వెలిగించుకున్న గుండె
అప్పన్నకొండ; కండగల కళింగాంధ్ర కలకండ!

గిడుగు వారసుడిగా "వ్యావహారిం"చిన పిల్లపిడుగు,
ఫిరంగి గుండు;
ఛాందసం మడికీ, గ్రాంథికం జడికీ జడియని గండరగండ.
తోకతొక్కిన కోడెనాగు పడగ నింగి కెత్తిన విప్లవ
"పులిపంజా!"
తోక తక్కువ తొంభై దీపావళులు తొంగలించిన సారస్వత
సంజ
జన పదాన ఎగరేసిన "జానపదం" జయ జండా!
అభ్యుదయకామి; అగ్రగామి; అప్పలస్వామి పులిపంజా!!